క్లుప్తంగా

పనులు నాణ్యతతో చేపట్టాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొట్టపెల్లి గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. రోడ్డు వేసిన తర్వాత క్యూరింగ్ చేపట్టాలన్నారు. అనంతరం గ్రామనర్సరీని సందర్శించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శి ప్రియాంక రెడ్డి ఉన్నారు.

నిజాయతీ చాటిన డ్రైవర్లు

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాగును తిరిగి ప్రయాణికుడికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు నిర్మల్ డిపో డ్రైవర్లు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం తెల్లవారుజామున నిర్మల్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమలాపురానికి లహరి నాన్ ఏసీ బస్సు హైదరాబాద్ మీదుగా బయలుదేరింది. బాపూజీ అనే ప్రయాణికుడు హైదరాబాద్‌లో బస్సు ఎక్కి రూ.80 వేల విలువైన ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాగును బస్సులో మర్చిపోయి అమలాపురంలో దిగాడు. గమనించిన డ్రైవర్లు మూర్తి, ఆదినారాయణ బ్యాగులో ఉన్న వివరాల ఆధారంగా అతడిని వెనక్కి పిలిపించి బ్యాగును అప్పజెప్పారు. డ్రైవర్లను నిర్మల్ డిపో మేనేజర్ పండరి అభినందించారు.

కేంద్రాల్లోనే అమ్ముకోవాలి



మాదాపూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న భీమ్‌రెడ్డి

సోన్: రైతులు తమ పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాదాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో మంజులాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బర్మా గంగదాస్, డైరెక్టర్లు నక్కల మ. దుకర్‌రెడ్డి, బోడిగాం రమేశ్‌రెడ్డి, రాజనర్సింహారెడ్డి, బోసాని రాజేశ్వర్, అల్లూరి శ్రీనివాస రెడ్డి, వీడీసీ సభ్యులు తదితరులు ఉన్నారు

'కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో అక్రమాలు'

భైంసాటౌన్: పట్టణంలోని మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని.. దీనిపై సమగ్ర విచారణ జరపాలని మాజీ కౌన్సిలర్ కపిల్ సిందే డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచి.. నేరుగా కార్మికుల ఖాతాల్లోనే జమ చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం శ్రీ వాసర సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామపెద్దలు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ కనీస్ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి యోగేష్, కరస్పాండెంట్ లోలం గజానంద్, ఎగ్గం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బైండోవర్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో సోమవారం శాంతి భద్రతలకు భంగం కలిగించేలా అనుమానాస్పదంగా రాత్రి సమయాల్లో తిరుగుతున్న ఎండీ.సమీరుద్దీన్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అతడిని హెచ్చరించారు.

గన్నీబ్యాగుల కోసం పడిగాపులు



కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న రైతులు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె)లో ఇటీవల పీఏసీఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. కానీ కొనుగోలు కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు లేకపోవడంతో రైతులు రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ఓవైపు ఎండల తీవ్రత, మరోవైపు అకాలవర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రానికి గన్నీ బ్యాగులు సరఫరా చేయాలని అధికారులను కర్షకులు వేడుకుంటున్నారు.

ఆరేళ్లుగా.. అలంకారప్రాయమే..



కుంటాల: మండలకేంద్రంలోని రెండోవార్డులో తాగునీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఆరేళ్ల కిందట మండల పరిషత్ నిధులు రూ.40వేలతో మినీట్యాంకు నిర్మించారు. ఇక్కడ బోరు ఉన్నప్పటికీ మోటార్ ద్వారా కనెక్షన్ ఇవ్వకపోవడంతో మినీట్యాంకు అలంకారప్రాయంగా మారింది. అధికారులు స్పందించి మినీట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించరూ..



కుంటాల: కుంటాలలోని శ్రీ గజ్జలమ్మ ఆలయ సమీపంలో ములుపు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో భక్తులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు మార్చి కంచె ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇంధనానికి కావాలి చల్లదనం..!



భైంసాటౌన్: రోజురోజుకు పెరుగుతున్న ఎండల నుంచి రక్షణ పొందేందుకు జనం అల్లాడుతున్నారు. రక్షణ లేనిదే ఇంటి నుంచి బయటకు రావడం లేదు. మరోవైపు అధిక ఉష్ణోగ్రతలతో పెట్రోల్‌బంకుల్లో ఇంధనం పోసే యంత్ర పరికరాలు సైతం మొరాయిస్తున్నాయి. దీంతో పట్టణంలో నిర్మల్ రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్‌బంక్‌లో యంత్రాలకు చల్లదనం కోసం నిర్వాహకులు ఇలా గోనెసంచులు కట్టి ఉంచుతున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో..

ముధోల్: యాసంగి పంట దిగుబడులు చేతికి వచ్చిన తర్వాత భూములను అలాగే వదిలేయకుండా దుక్కులు దున్నితే ప్రయోజనాలుంటాయమని ముధోల్ ఏవో వినయ్ సూచిస్తున్నారు. 25 సెం.మీ నుంచి 30 సెం.మీ లోతుకు భూములను వాలుగా దున్నితే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు చీడపీడలు తొలుగుతాయన్నారు. ముందుగానే దుక్కులు దున్నితే వానాకాలం పంట వేసుకునేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

లాభాలివీ..

- వేసవిలో దుక్కి దున్నడం ద్వారా భూమి సారవంతంగా మారుతోంది. దీంతో రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్ తక్కువ అవసరమై లాభాలు పొందే వీలుంటుంది.
- వేసవిలో భూమిని దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేస్తాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతింటుంది. దుక్కులు దున్నడం ద్వారా వీటి బెడద తగ్గుతుంది.
- పంటలను ఆశించే పురుగులు వేసవిలో నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నితే పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారంగా మారుతాయి. మరికొన్ని ఎండల తీవ్రతకు చనిపోతాయి.
- వేసవి దుక్కులతో భూమిలోని గడ్డిపొరలు విడిపోయి భూమి గుల్లబారుతుంది. దీంతో నీటిని నిల్వచేసుకునే శక్తి పెరుగుతుంది.
- కలుపు మొక్కలు నశించడంతోపాటు సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులుగా మారుతాయి.
- గత పంటకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది.
- వాలుకు అడ్డుగా దుక్కులు దున్నడంతో నేల కోతకు గురవకుండా ఉంటుంది.
- కనీసం 25 నుంచి 30 సెంటీమీర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా రెక్కనాగలి, పల్లపు నాగలి ఉపయోగించాలి.
- పంటను దెబ్బతీసే శిలీంద్ర బీజాలు భూమిలో నుంచి బయటకు వచ్చి ఎండకు చనిపోతాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకొని పైభాగం సరైన పీహెచ్‌లో ఉంటుంది.
- యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటవేటర్లు వినియోగించాలి.
- చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలవడంతో అవి ముగిరి నేలకు ఎరువుగా మారుతాయి.

పొలాల్లో చెత్త, ఆకులు కాల్చొద్దు..

వ్యవసాయ భూముల్లో చెత్తను, ఆకులను కాలకుండా భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుందని ఏవో వివరిస్తున్నా రు. ఒకరిని చూసి మరొకరు చెత్తను, ఆకులు కాల్చవద్దని రైతులకు సూచిస్తున్నారు. పశువుల పేడ వేసుకుంటే మరింత మేలని చెబుతున్నారు.

హైవే పనుల్లో అలసత్వం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

భైంసాటౌన్/భైంసారూరల్: భైంసా–బోధన్ రహదారి నిర్మాణ పనుల్లో గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. దీంతో జిల్లాలోని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పనులు పూర్తి చేయకుండా కంకర వేసి వదిలేస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో దుమ్ము, ధూళితో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదు. భైంసా మండలంలోని దేగాం గ్రామం నుంచి గడ్చాంద వెళ్లే రహదారిపై నిర్మించిన కల్వర్టు వద్ద తరచూ వాహనాలు దిగబడటంతోపాటు బోల్తాపడుతున్నాయి. సోమవారం రాత్రి దేగాం శివారులో జొన్నల లోడ్ లారీ కల్వర్టు కూలిన చోట దిగబడింది. దీంతో ఆ మార్గంలో వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి.



రోడ్డుపై మట్టిలో కూరుకుపోయిన లారీ

మంగళవారం దిగబడ్డ లారీ నుంచి మరో లారీలోకి ధాన్యం సంచులను ఎక్కించి తరలించారు. హైవేను ఆనుకుని గ్రామంలోకి వెళ్లే అప్రోచ్‌రోడ్డు వరకు బీటీరోడ్డు నిర్మించకపోవడంతో ఈ రోడ్డు కుంగి లారీ దిగబడింది. ఈ విషయమై హైవే డీఈఈ నరేశ్‌ను 'సాక్షి'ఫోన్‌లో వివరణ కోరగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని గుత్తేదారుకు సూచిస్తామని తెలిపారు.

రోడ్లపై గుంపులుగా తిరిగితే కేసు

నిర్మల్‌టౌన్: అర్ధరాత్రి రోడ్లపై గుంపులు తిరిగినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. సోమవారం అర్ధరాత్రి పట్టణంలో ఏఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అర్ధరాత్రి రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న 30 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణ పరిధిలో పకడ్బందీగా పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని.. ప్రజలకు ఇబ్బంది కల్గించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఇందులో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

'భూభారతి'తో సత్వర పరిష్కారం

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంతో భూసమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయని తహసీల్దార్ లింగంమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని వడ్ఝురి(బి) గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మే నెలలో గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ లింగంమూర్తి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తానూరు: స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం నారాయణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం తానూరులోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య మహాజన సభ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. చారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అందించిన రుణాలు, ఆదాయం, 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరించారు.

మండల కార్యవర్గం..

సమావేశం అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా పి.మంగళ, కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా శాంత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీసీలు భోజన్న, సాయినాథ్, సవిత, దత్తాత్రి, శ్రీనివాస్, ఆయా గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జీవరత్నం

ఖానాపూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అర్హులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎల్‌డీఎం రాంగోపాల్, ఎంపీవో రత్నాకర్‌రావఉన్నారు.

శిబిరం ఏర్పాట్లు పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణతోపాటు పీడీ ఇమ్రాన్, పీఈటీలు రాము, ఇర్ఫాన్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ శిబిరంలో వెయిట్ లిఫ్టింగ్, కరాటే, యోగా, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలపై శిక్షణ ఉంటుందని ఆసక్తి కల్గిన చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆరిఫ్, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ జయంతి

భైంసారూరల్: మండలంలోని సిద్దూర్, కుంబి గ్రామాల్లో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజాక్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావు, గజానంద్, ఆయా గ్రామాల నాయకులు, తదితరులు ఉన్నారు.

'కావేరి' సహకారం మరువలేం

నిర్మల్‌ఖిల్లా: తాము ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయం స్టడీ మెటీరియల్, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలు కల్పించి ఎంతో సహకారం అందించిందని ఇటీవల డీఎస్సీలో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కావేరి గ్రంథాలయంలో ఫౌండేషన్ చైర్మన్, గ్రంథాలయ స్థాపకులు డాక్టర్ అప్పాల చక్రధారినిని శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కావేరి గ్రంథాలయం కారణంగానే తాము విజేతలుగా నిలిచినట్లు స్పష్టంచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి దీపక్, ఉద్యోగాలు సాధించిన విజేతలు శ్రావణి, రాజు, గీత, ప్రసన్న, స్రవంతి, తిరుమలేశ్, నాగజ్యోతి, శ్రీకాంత్, ప్రతిభ, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



చక్రధారిని సన్మానిస్తున్న విజేతలు

ఖానాపూర్ జడ్జికి సన్మానం

ఖానాపూర్: బదిలీపై వెళ్తున్న ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్‌ను స్థానిక న్యాయవాదులు గజమాలతో సన్మానించారు. మంగళవారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జడ్జి జితిన్ కుమార్ మాట్లాడారు. ఉద్యోగం వచ్చాక మొదటి పోస్టింగ్‌లోనే ఖానాపూర్‌కు రావడం ఆనందంగా ఉందన్నారు. పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణంతో ఉన్న ఖానాపూర్ ప్రాంతాన్ని మరిచిపోలేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీపీ ఆసిఫ్‌అలీ, న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, రాజశేఖర్, శివ, వెంకటేశ్, కమలాకర్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, ఖదీర్, గంగాధర్, శ్యామ్, సాయి, శేఖర్‌శర్మ తదితరులు ఉన్నారు.



గజమాలతో సన్మానిస్తున్న న్యాయవాదులు

రైతులను ఇబ్బందులకు గురిచేయెద్దు

దస్తురాబాద్: ఆరుగాలం కష్టించి పంటలు పండించుకునే తమను రైస్‌మిల్లు యజమానులు ఇబ్బందులకు గురిచేయొద్దని మంగళవారం మండలంలోని పేర్కపల్లెలో ఆ గ్రామ రైతులు రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం బస్తాలో 41.5 కి లోల ధాన్యం తూకం వేయాల్సి ఉండగా.. ప్రస్తుతం బస్తాలో 42 కిలోలు తూకం వేస్తున్నారు. ఇప్పటికే బస్తాకు అరకిలో కోత విధిస్తున్నారు. అయితే రైస్‌మిల్ యజమానులు మాత్రం బస్తాకు కిలోన్నర (మొత్తం 43 కిలోలు) తీసుకొస్తేనే ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేసుకుంటామని బెదిరిస్తున్నారని వాపోయారు. ధర్నా సమాచారం తెలిసి డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారులకు ఫోన్‌లో వివరించగా.. రైతులకు నష్టం వాటిల్లకుండా మిల్లు యజమానులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వటంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ రచన తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మే డే విజయవంతం చేయాలి



మే డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. మండలంలోని సత్తనపల్లి బీడీ కంపెనీ వద్ద మంగళవారం మే డే పోస్టర్ ఆవిష్కరించారు. కార్పొరేట్ శ క్తులకు ప్రజాధనం కట్టబెట్టడంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ.. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ల రద్దుపై లేదని విమర్శించారు. ప్యాకర్స్ యూనియన్ అధ్యక్షుడు భోజన్న, కార్యదర్శి రామ్మోహన్, రాజేశ్వర్, పెద్దన్న, భీంరావు, శేఖర్ తదితరులున్నారు.

సకాలంలో దుస్తులు అందించాలి

దస్తురాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. ఏకరూప దుస్తులను కుట్టే దస్తురాబాద్‌లోని మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎంఈవో సందర్శించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, పంచాయతీరాజ్ జేఈలు సూర్యతేజ, చందన్, ఐకేపీ సీసీలు రతిలాల్, లావణ్య, సీఆర్పీలు, ఐఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధర్

ఆయిల్‌పాం సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

కడెం: వేసవిలో ఆయిల్‌పాం సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ క్లస్టర్ అధికారి స్పందన అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్‌కాలనీలో గుర్రాల దేవేందర్‌రెడ్డి అనే రైతు సాగు చేసిన ఆయిల్‌పాం క్షేత్రంలో మండలంలోని ఆయా గ్రామాల రైతులకు తోటల సంరక్షణ, పంటల నిలుపుదల, కొనుగోలు, యాజమాన్య పద్ధతులు, గెలల సేకరణ కేంద్రాల గురించి అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి స్పందన